

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక - పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

**కలకత్తాలో** అన్నయ్య ఇంటికొచ్చినవాళ్లు మావాళ్లని చూసి – ఇంత స్వీట్ భార్యనీ, స్వీట్ పిల్లల్నీ వదిలి ఏ మగవాడు దూరంగా ఉండగలడు అంటున్నారుట. అమ్మాయైతే ఈడుకు మించిన పరిణతితో వ్యవహరిస్తోందిట. అన్నయ్య కుటుంబంతో కలిసి బయట నడిచేటప్పుడు – అబ్బాయిని శ్రీమతి ఎత్తుకునేదిట. అమ్మాయి ఈడుదే అయిన అన్నయ్య కూతురు కమలిని అన్నయ్య ఎత్తుకునేవాడుట. అప్పుడు అమ్మాయి, "నాన్నగారిక్కడ లేరుగా, నువ్వు నన్నెత్తుకోలేవు. నేను నడుస్తాన్లే" అంటుందిట.

అబ్బాయి అల్లరి కాస్త ఎక్కువగానే ఉన్నా – అందులో దురుసుతనం కంటే తెలివి ఎక్కువట.

"ఒరేయ్, బాబీ! నువ్విలా అల్లరి చేస్తే నిన్ను విమానం ఎక్కించుకోరు మరి" అని శ్రీమతి ఓసారి మందలించిందిట. దానికి వాడు, "నేను ముద్దుగా ఉంటానుగా, నన్నెందుకు ఎక్కించుకోరు? నేనే ఎక్కనని మారాం చేస్తాను. అప్పుడు వాళ్లు నాకో అరటిపండిచ్చి, బాబీ – ఎక్కమ్మా – అని బ్రతిమాలి ఎక్కించుకుంటారు" అన్నాడుట తన ముద్దు మాటలతో.

అంతా తనని ముద్దు చేస్తారని వాడికి ఎవరన్నా భయం లేకుండా పోయింది. కానీ కోపమొస్తే మిగతావాళ్లు వెనకాడతారు కానీ, శిక్షించడానికి తల్లి వెనకాడదు కదా!

అందుకని వాడికి శ్రీమతి అంటేనే కాస్త భయం.

విమానం ఎక్కడానికి మన పద్ధతి మనకుండొచ్చు కానీ వాడి ఆలోచన వేరే ఉంది. విమానం గాలిలో ఉంటుంది కదా – అదెక్కాలంటే అంతెత్తు ఎగిరి ఎక్కాలనుకుంటున్నాడు. అందుకోసం వాడిప్పుడు రోజూ గాల్లోకి ఎగరడం అభ్యసిస్తున్నాడు. శ్రీమతికి వాణ్ణి కాసుకోవడం ఇబ్బందిగా ఉంటోంది.

"వాణ్ణి పట్టించుకోకు. ఒకసారి పడి దెబ్బలు తగిలితే వాడికే తెలిసొస్తుంది" అన్నాట్ట అన్నయ్య. కానీ పడితే వాడిదేంపోయింది. ఏడుపు లంకించుకుంటాడు. ఊరుకోబెట్టడం ఓ అదనపు పని. ఆపైన తల్లి కదా, వాడి బాధ వాడికంటే తనే ఎక్కువగా అనుభవిస్తుంది.

ఈ వివరాలన్నీ చదువుతుంటే నా మనసక్కడికి వెళ్లిపోయింది. అన్నీ నా కళ్లముందే జరుగుతున్నట్లున్నాయి. కానీ ఎవరితోనూ మాట్లాడలేనుగా, నా కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఈ వివరాల సంగతటుంచితే, ఉత్తరం చివర శ్రీమతి, "మీ ఉత్తరం చూసుకుని, పాస్‌పోర్ట్ ఏర్పాట్లు చూసుకుంటాం" అని వ్రాసింది.

ఆ వాక్యం నా గుండె గుభేల్మనిపించింది.

నా ఉత్తరం అందేక, అప్పుడు పాస్‌పోర్టు తీసుకునేమాటైతే, అసలే ఇండియా – ఈ వ్యవహారం ఎప్పటికి తేలేను?

నేను తనకి టికెట్లు ఇక్కణ్ణించే ఏర్పాటు చేస్తున్న విషయం అర్జంటుగా తెలియాలి. ఇక ఉత్తరం లాభం లేదు. టెలిగ్రాం ఇవ్వాల్సిందే!

కాసేపాలోచించి పోస్టాఫీసుకి వెళ్లాను. ఖర్చు ఆదా చెయ్యడం కోసం – వాక్యాల్ని వీలైనంత పొదుపుగా వాడి, 'టికెట్లు ఇక్కణ్ణించి పంపుతున్నాను' – అని టెలిగ్రాం ఇచ్చాను. ఆ మాత్రం దానికే పన్నెండు మార్కుల చిల్లరయింది.

నేనప్పుడు డబ్బు గురించి ఆలోచించడంలేదు. టెలిగ్రాం అందగానే శ్రీమతిలో కలిగే ఆనందోత్సాహాలు తల్చుకుని తెగ మురిసిపోయాను.

కానీ ఆ ఆనందం ఎంతోసేపు నిలబడలేదు.

మనసొక అనుమానాల పుట్ట. అందులోంచి అనుమానాలు పాములై వచ్చి కాటేస్తూంటాయి. నాకొచ్చిన అనుమానం అన్నయ్య ఇంటి నంబరు విషయంలో. తరచుగా ఉత్తరాలు రాస్తున్నాను కాబట్టి అది 378 అని నాకు కంఠతాయే. కానీ జర్మన్లు ఒకటి అంకెకు పైన కాస్త

వంకర గీత కలిపి ఏడు అనిపించేలా వేస్తారు. ఒకటికీ ఏడుకీ తేడా తెలియడానికి ఏడుకి మధ్యన చిన్న అడ్డ గీత వేస్తారు. ఇప్పుడు నేను టెలిగ్రాంకిచ్చిన అడ్రసులో ఏడంకెని నాకు అలవాటైన ఇండియన్ పద్ధతిలో వేశాను.

పోస్టుమాస్టరు దాన్ని ఒకటి అనుకుని, కలకత్తాలో 318 ఇంటికి పంపి, ఎవరూ లేక....

అమ్మో – కొంపలు మునిగిపోవూ!

దీనికి పరిష్కారం ఏమిటని మనసులో కలవరం మొదలైంది. అప్పుడు నాలో వివేకం మేల్కొని, "సమస్యకు పరిష్కారం చెప్పలేను కానీ, కలవరాన్ని పరిష్కరించగలను. నువ్వు వేసిన నంబరు పోస్టుమాస్టరుకి 378గానే తోచిందని నమ్ము" అంది.

నమ్మకమాత్రం చేసేదేముంది? వివేకం మాట విన్నాను. ఐతే టెలిగ్రాంతో సరిపెట్టుకోక, మర్నాడు అన్నయ్యకీ, శ్రీమతికీ – టెలిగ్రాంలోని వాక్యాన్ని కాస్త పెంచి ఉత్తరాలు వ్రాశాను. శ్రీమతికి వ్రాసినప్పుడల్లా, అన్నయ్యకీ ఓ ఉత్తరం వ్రాయడం ఇటీవల నాకేర్పడ్డ కొత్త అలవాటు.

వివేకం దారి వివేకానిదే – 1, 7 ల మీమాంస ఇంకా నన్ను వదల్లేదు. అనుమాన నివృత్తికోసం నేనో కాగితంమీద 378 నంబరు వేసి నా జర్మన్ మిత్రులకి చూపించాను.

చూసిన ప్రతి ఒక్కరూ 318 అనే చదివారు. అంటే 12 మార్కుల టెలిగ్రాం గోవిందా!

మనసు వివేకాన్ని పక్కకు నెట్టేసి తెగ బాధ పడిపోతుంటే – ఉపశాంతి కోసం ఓంప్రకాష్‌కి ఫోన్ చేశాను. అతను దొరకలేదు.

ఒకటికీ ఏడుకీ మధ్య నలిగిపోతూ ఆ రోజంతా గడిపేసేక మర్నాడు నాకు ఓంప్రకాష్ తనే స్వయంగా ఫోన్ చేశాడు. వెంటనే అతడికి నా మీమాంస చెప్పుకున్నాను.

"నంబరు వేసేముందు ఆలోచించొద్దూ?" అని అతడు నన్ను మందలించాడు. మళ్లీ ఏమనుకున్నాడో ఏమో, కాసేపట్లో వస్తున్నానని చెప్పాడు.

ఓంప్రకాష్ వచ్చేసరికి, ఇంటి దగ్గర్నుంచి రెండుత్తరాలొచ్చాయి. శ్రీమతి వ్రాసినప్పుడల్లా తనూ నాకుత్తరం వ్రాయడం అన్నయ్యకీ అలవాటయింది.

ఏముందీ, మామూలే! ఇద్దరిదీ ఒకే మాట! నా ఉత్తరం చూసుకుని పాస్‌పోర్టు ఏర్పాట్లకు వెడతారుట.

అంటే పాస్‌పోర్టు గురించి అక్కడింకా ప్రయత్నాలు మొదలవలేదు.

అన్నయ్య సంగతి నాకు తెలుసు. గోటితో పోయేదాన్ని గొడ్డళ్లవరకూ తీసుకొచ్చి అప్పుడు సాధిస్తాడు.

ఏ పనైనా సరే వాయిదాకి అవకాశముంటే, ఎంతవరకూ వీలైతే అంతకాలం వాయిదా వేస్తాడు. అది నా పద్ధతికి పూర్తిగా విరుద్ధం. ఎన్నోసార్లు అన్నయ్యని నేనీ విషయమై బాగా హెచ్చరించాను. అన్నయ్య ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసేవాడు.

అందుకు కారణం లేకపోలేదు. ఇంతవరకూ అన్నయ్యకు జీవితంలో వైఫల్యాలు లేవు. నాకున్నాయి.

మనిషి స్వానుభవంనుంచి నేర్చుకున్నంతగా ఇతరులనుంచి నేర్చుకోవాలనుకోడు. నా హెచ్చరికను పెడచెవిని పెట్టి నష్టపోయిన సందర్భాలు ఇంతవరకూ లేవు తనకి. కానీ నాకిప్పుడు అన్నయ్య అవసరమొచ్చింది. నా అవసరం తీర్చడానికి తను తన పద్ధతి కొనసాగిస్తున్నాడు.

ఓంప్రకాష్ వస్తూనే, "గుడ్ న్యూస్ డాక్టర్ రావ్! జనవరి ఏడుకి టికెట్సు బుక్కయ్యాయి. రేపు డబ్బు తీసుకెళ్లివ్వాలి. సాక్ష్యానికి మన కూడా గోపాలకృష్ణన్‌ని తీసుకెడదాం" అన్నాడు.

"సాక్ష్యమేమిటి?" అన్నాను అనుమానంగా.

ఓంప్రకాష్‌కి నా ముఖం చూడగానే నవ్వొచ్చింది. "భయపడకు. ఈ టికెట్ల వ్యవహారంలో మోసమేమీ ఉండదు. ఎటొచ్చీ మన జాగ్రత్తలో మనముండాలి" అన్నాడు.

సరేనని – ఇంటిదగ్గర ఇంకా పాస్‌పోర్టులు సిద్ధం కాలేదన్న విషయం చెప్పానతడికి.

ఓంప్రకాష్ ఓ క్షణం ఆలోచించి, "వెంటనే ఇంకో టెలిగ్రాం ఇయ్యి" అన్నాడు.

"ఇంకో టెలిగ్రామా? చాలా ఔతుంది" అన్నాను గాభరాగా.

"ఇది డబ్బుకి చూసుకునే సమయం కాదు. అక్కడ మీవాళ్లకి వేడి పుట్టాలంటే, టెలిగ్రామెలా ఇవ్వాలో నేను చెబుతాను" అన్నాడు ఓంప్రకాష్.

విపత్కర సమయాల్లో ఎవర్నో ఒకర్ని పూర్తిగా నమ్మి అనుసరిస్తే, మనకి భారముండదు. కురుక్షేత్ర సంగ్రామంలో పార్థుడు అదే చేశాడు.

నేను ఓంప్రకాష్‌తో కలిసి పోస్టాఫీసుకి వెళ్లాను.

"టికెట్స్ పోస్టెడ్. ఎరేంజ్ పాస్‌పోర్ట్స్ అండ్ బర్త్ సర్టిఫికెట్స్. ఫ్లైట్ బై ఏరోఫ్లోట్ ఫ్రం ఢిల్లీ. సెవెన్త్ జనవరి" అని ఇంచుమించు ఉత్తరంలా వ్రాశాం.

అక్కడ రెండు రకాల టెలిగ్రాములున్నాయి. ఒకటి టెలిగ్రాం పద్ధతి. ఆ పద్ధతిలో ఐదు పదాలకు ఇరవైఒక్క మార్కుల ఇరవైఒక్క ఫెనిగ్స్. ఇంకోటి ఉత్తరం పద్ధతి. ఇలా చెయ్యడం వల్ల ఇంత ఉత్తరమూ ఇరవైమార్కులకి ఇరవై ఫెనిగ్సు తక్కువ.

ఈ టెలిగ్రాంలో చిన్న అబద్ధముంది. టికెట్సింకా పోస్టవలేదు.

డబ్బయితే అయింది కానీ, టెలిగ్రాం ఇచ్చేక మనసు తేలిక పడింది.

మర్నాడు బ్యాంకునుంచి రెండువేల ఏడొందల యాభై మార్కులు డ్రా చేశాను. శ్రీమతి, పిల్లలు ఇక్కడికొచ్చి నాతో గడిపి వెళ్లడానికి చెల్లిస్తున్న మూల్యమది. అది నాకు చాలా పెద్ద మొత్తమే. కానీ జర్మనీలో ఉన్న ఏడు నెలలలోపులోనే కూడబెట్టగలిగానది.

నావాళ్లని నా డబ్బుతోనే ఇక్కడికి రప్పించుకుంటున్నానన్న భావన ఆ క్షణంలో కించిత్ గర్వాన్ని కలిగించింది.

మర్నాడు మధ్యాహ్నం మూడున్నరకి డాక్టర్ రాలెక్‌కి విషయం చెప్పి, ఆఫీసునుంచి బయల్దేరి, తిన్నగా గోపాలకృష్ణన్ లాబొరేటరీకి వెళ్లాను. అక్కణ్ణించి ఇద్దరం ఓంప్రకాష్ దగ్గరకి బయల్దేరాం. దారిలో ఆకలిగా ఉందని కర్రీ వుర్‌స్ట్ తిన్నాడు గోపాలకృష్ణన్.

ఈ కర్రీ వుర్‌స్ట్ చిన్న సైజు కొవ్వొత్తి ఆకారంలో ఉండే మాంసపుకడ్డీ. రకరకాల మాంసాల్ని బాగా కలిపి ముద్ద చేసి ఈ ఆకారంలో ముక్కలుముక్కలుగా కోసి, నూనెలో వేయించి అమ్ముతారు. నంచుకుందుకు పచ్చి ఆవపిండి ఇస్తారు, మనవైపు పకోడీల దుకాణాల్లాగా, ఇక్కడ వుర్‌స్ట్ దుకాణాలు ఎక్కడపడితే అక్కడుంటాయి.

గోపాలకృష్ణన్ ఇండియాలో ఫక్తు శాకాహారి. మొదట్లో వుర్‌స్ట్ తినడానికి అతడికి మనస్కరించలేదుట. మిత్రుల బలవంతంమీద ఒకసారి తింటే, నోటికి హితవుగా అనిపించిందిట. ఒక వుర్‌స్ట్ కడ్డీ ఒక మార్కు. రోజుకి సరిపడ పోషక విలువలు ఒక్క మార్కుతో లభిస్తున్నాయని, క్రమంగా అతడు దానికి అలవాటు పడ్డాడు. ఇలాంటి చలి దేశంలో ఇలాంటివి తినడం అలవాటు చేసుకోవడం అవసరమని అతడు నాకు చెప్పాడు.

అంతవరకూ నాకు అలాంటి అవసరమేదీ కలగలేదు. రుచి మాటటుంచి వుర్‌స్ట్ ఆకారం నాకు వెగటుగా అనిపించేది. ఆ మాట అతడికి చెప్పలేదు. ఎందుకంటే గోపాలకృష్ణన్ చెయ్యెత్తు భారీ మనిషి. నేను పిట్టలా ఉంటాను. పోషకపదార్థాల అవసరం శరీరానుగతం కదా!

ఇద్దరం ఓంప్రకాష్‌ని కలుసుకుని – అక్కణ్ణించి ముగ్గురం కలిసి ఇండియన్ కన్సలేట్‌కి వెళ్లాం. సరళ్‌సేన్ వచ్చాడు కానీ చెప్పిన టైముకి కాస్త ఆలస్యంగా వచ్చాడు.

అతను టికెట్లు తెచ్చాడు. మొత్తం మూడు టికెట్లు. పిల్లలిద్దరికీ కలిపి పదిహేనొందలు. శ్రీమతి టికెట్టు పన్నెండొందల యాభై మార్కులు. నేను డబ్బిచ్చాను.

టెలిగ్రాంలో నేను వ్రాసినప్పటి అబద్ధం, ఆ టెలిగ్రాం అన్నయ్యను చేరుకునేసరికి నిజమైంది.

వివరాలు, విశేషాలు, టికెట్లు నింపుకున్న బరువైన కవరొకటి – ఆరోజు అక్కడి పోస్టాఫీసునుంచి ఇండియాకి పయనమైంది. ఆ రోజు డిసెంబర్ 20.

నావాళ్ల ప్రయాణం విషయమై ఉన్న సమస్యలన్నీ అంతటితో పరిష్కారమైపోయాయనుకున్నాను. జనవరి ఏడవ తేదీన నావాళ్లు నన్ను చేరుకునేవరకూ వాళ్ల గురించి ఎదురుచూడ్డం మినహా ఇంకేం చెయ్యక్కర్లేదనుకున్నాను. అనుకున్నాను కానీ – అసలు సమస్యలన్నీ అప్పుడే మొదలయ్యాయని అప్పుడు నాకు తెలియదు.

పీత కష్టాలు

సరళ్‌సేన్ నాకిచ్చిన టికెట్లపై విమానం చేరే స్థలం ఈస్ట్ బెర్లిన్ అని ఉంది.

నేనుంటున్నది వెస్ట్ బెర్లిన్. అది పశ్చిమ జర్మనీలో ఉంది. ఈస్ట్ బెర్లిన్ తూర్పు జర్మనీలో ఉంది. అంటే రెండూ వేర్వేరు దేశాల్లో ఉన్నాయి.

టికెట్లిచ్చినప్పుడే, “బెర్లిన్ అంటే మన బెర్లిన్ అనుకున్నాను” అన్నాను నేను సరళ్‌సేన్‌తో.

“ఇది ఏరోఫ్లోట్ విమానం. వెస్ట్ బెర్లిన్‌కెందుకొస్తుంది?” అన్నాడు సరళ్‌సేన్ అదేదో మామూలు విషయమైనట్లు.

ఏరోఫ్లోట్ రష్యాకు చెందిన విమానం కంపెనీ. రష్యా కమ్యూనిస్టు దేశమైనా, ఆ కంపెనీ విమానాల సేవల్ని కమ్యూనిస్టేతర దేశాలకూ విస్తరించింది. కానీ నేను కొన్న టికెట్టు ఆ పరిధిలోకి రాదు. ఇది తక్కువ ధరలకు ఏర్పాటు చెయ్యబడ్డ ఛార్టర్డ్ ఫ్లైట్. ఈ చౌక ప్రయాణం కమ్యూనిస్టు దేశాలకు మాత్రమే పరిమితం.

ఈ విషయం నేను ముందే తెలుసుకోవాల్సింది. సరళ్‌సేన్ నాకు మరింత స్పష్టమైన అవగాహన కలిగించి ఉంటే బాగుండేదనుకున్నాను మనసులో. పైకి మాత్రం ఏమీ అనలేదు.

ఐతే ఇంత జరిగినా కూడా నేనా విషయాన్ని తీసుకోవాల్సినంత సీరియస్‌గా తీసుకోలేదు. “దాందేముందీ, నావాళ్లని వెస్ట్ బెర్లిన్లో బదులు ఈస్ట్ బెర్లిన్లో రిసీవ్ చేసుకుంటాను. అంతే కదా” అనుకున్నాను.

ఇలాంటి పొరపాట్లు నేను చాలా సార్లే చేశాను. ఐనా ఎప్పటికప్పుడు పరగడుపే.

అనుమానాలు తీర్చేవాడు ఎదురుగా ఉన్నప్పుడు సమస్య లోతుల్లోకి వెళ్లాలనిపించదు. సరళ్‌సేన్ చెయ్యి చాపి, “ఆర్ యూ హేపీ!” అని కరచాలనం చేస్తే – “వెరీ హేపీ, థాంక్యూ” అని పంపేశాను.

అతను వెళ్లిపోయేక – అప్పుడు మొదలయ్యాయి నాలో అనుమానాలు – వరుసగా ఒకటి తర్వాత ఒకటిగా –

ఈస్ట్ బెర్లిన్ బెర్లిన్లో ఒక భాగం కావచ్చు. అక్కడి పౌరులూ జర్మన్సే కావచ్చు. ఆ నగరంలో చెలామణీ అయ్యే భాష కూడా జర్మనే కావచ్చు. కానీ అది కమ్యూనిస్టు దేశం.

మొదట్నించీ కమ్యూనిస్టు దేశాల్లో నాకు నచ్చనిదిదే!

అక్కడ మనిషికీ మనిషికీ భేదం లేదు. పేదా గొప్పా వ్యత్యాసం లేదు. సమిష్టిగా కృషి చేసి సమిష్టిగా అనుభవిస్తారు. కానీ.....

అక్కడ ప్రభుత్వాలకి తమ పౌరులపై నమ్మకముండదు. కమ్యూనిస్టేతర దేశాల్లోని వైభవ స్వేచ్ఛా జీవితం తమ ప్రజలను సమ్మోహపర్చగలదని వాటికి తెలుసు. అందువల్ల తమ పౌరుల ఆలోచనలు ప్రభావితమై ధనస్వామ్యానికి అనుగుణంగా మారిపోగలవని వాటి భయం.

అందుకే కమ్యూనిస్టు ప్రభుత్వాలు తమ పౌరుల్ని అదుపు చెయ్యడానికి వారిపై ఎన్నో ఆంక్షలు విధించాయి. అలాగే ఆ దేశాల్లో ఇతరులు అడుగు పెట్టడానికీ ఎన్నో ఆంక్షలుంటాయి.

ఈస్ట్ బెర్లిన్ వెస్ట్ బెర్లిన్‌ని ఆనుకునే ఉంది. కానీ వెస్ట్ బెర్లిన్ నుంచి ఈస్ట్ బెర్లిన్ వెళ్లాలంటే మాత్రం గగనానికీ ఇలకూ బహుదూరం అని పాడుకోక తప్పదు.

కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండియాకు వెళ్లడానికి డబ్బొక్కటే అడ్డు. ఈస్ట్ బెర్లిన్‌లోకి వెళ్లడానికి డబ్బు ఏమాత్రం సహకరించదు.

దేవుణ్ణి నమ్మినవారు ఆస్తికులు. నమ్మనివారు ఆస్తికులు. నేనెరిగిన ఆస్తికులు నన్ను నాస్తికుడనుకుంటారు. నేనెరిగిన నాస్తికులు నన్ను ఆస్తికుడనుకుంటారు. నేను ఆస్తికుణ్ణా, నాస్తికుణ్ణా అన్న విషయమై నేనెప్పుడూ ఎక్కువ ఆలోచించలేదు. ఎందుకంటే నా దైనందిన జీవితానికి అదంత ముఖ్యం కాదు.

అలాగే నాకు కమ్యూనిస్టు సిద్ధాంతాల గురించి తెలిసింది తక్కువ. ఆనోటా ఈనోటా విన్నదే ఎక్కువ. అంతకుమించి తెలుసుకోవాలన్న కుతూహలం కూడా నాకు లేదు. ప్రస్తుతానికి నేనిరుక్కున్న పరిస్థితుల్లో – కమ్యూనిస్టు వ్యవస్థ నాకు ఇబ్బందిగా ఉందని అర్థమైందంతే!

బెర్లిన్ వచ్చేక ఈ నాలుగు నెలలలోపూ ఒకే ఒక్కసారి ఈస్ట్ బెర్లిన్ వెళ్లాను. అదీ గ్యోతే ఇన్‌స్టిట్యూట్ సహవిద్యార్థి శర్మ నన్ను చూడ్డానికి వెస్ట్ బెర్లిన్ వచ్చి – ఓసారి ఈస్ట్ బెర్లిన్ చూడాలనుందని బలవంతపెట్టినప్పుడు.

పోనీలే ఈ ప్రయాణం విషయంలో కొంత అనుభవమొస్తుందనుకుని సరేనన్నాను.

అప్పటికి నాకు తెలిసిందేమిటంటే – రెండు బెర్లిన్లకూ మధ్య ఒక ఒప్పందముంది. ఆ ప్రకారం వెస్ట్ బెర్లిన్‌నుంచి ఈస్ట్ బెర్లిన్ వెళ్లడానికి జేబులో పాస్‌పోర్టూ, పర్సులో ఓ ఐదు మార్కులూ ఉంటే చాలు. వెళ్లేక ఇరవై నాలుగు గంటల్లో తిరిగి వెనక్కి వచ్చేయాలన్న షరతు మాత్రం ఖచ్చితంగా పాటించాలి.

ఇద్దరం ట్రయిన్లో వెళ్లాం. ఈస్ట్ బెర్లిన్ ప్లాట్‌ఫారంమీద దిగాం. అక్కడ బ్లాక్ అండ్ వైట్ విస్కీ వెస్ట్‌లో కంటే చౌకట. తనో బాటిల్ కొనుక్కుంటానన్నాడు శర్మ. చిల్లర లేదంటే నేనే కొన్నాను ఆ బాటిల్. అదయ్యేక, “ఇక్కడ ఊళ్లో చూడ్డానికేముంటుందిలే, వెనక్కి వెళ్లిపోదాం” అన్నాడు శర్మ.

అతను ఏం మారలేదనుకున్నాను. అతనికి మందుమీద తప్ప మరే ఆసక్తీ లేదు. నాచేత తనకోసం మందు కొనిపించి అది తీసుకుని వెళ్లిపోయాడు.

ఆ ప్రయాణంవల్ల శర్మకి మందు దొరికిందంతే! నాకు ఈస్ట్ బెర్లిన్ గురించి అవగాహన చేసుకునే అవకాశం రాలేదు.

పోనీ ఇప్పుడూ అప్పటిలాగే ట్రయిన్లో ఈస్ట్ బెర్లిన్ వెడదామా అనుకుంటే – నా సమస్యకు పరిష్కారం అంత సులభం కాదు.

ఈస్ట్ బెర్లిన్ విమానాశ్రయం – నగరం సరిహద్దులకి కాస్త అవతల ఉన్నదట. అంటే విమానాశ్రయం ఈస్ట్ బెర్లిన్లో కాక, తూర్పు జర్మనీలో ఉంది. రెండు నగరాల మధ్యా ఉన్న ఒప్పందం – తూర్పు జర్మనీకి వర్తించదు.

ఇవన్నీ నాకు తెలియవు. తెలియగానే ఏం చెయ్యాలో తోచక వాళ్లనీ వీళ్లనీ వాకబు చెయ్యడుం మొదలెట్టాను. వాళ్లలో – ఓం ప్రకాష్, లియోపాల్డ్ ప్లాట్జ్ హాస్టల్లోని ఇతర భారతీయులు, సరళ్‌సేన్‌లు కూడా ఉన్నారు.

దేనికైనా దిగేదాకా లోతు తెలియదని సామెత. వాకబు చేస్తున్నకొద్దీ నా సమస్యల లోతు ఇంకా ఇంకా పెరిగిపోతోంది.

నేనడిగిందానికి పరిష్కారం చెప్పడానికి బదులు – సరళ్‌సేన్ మరో బాంబు పేల్చాడు.

ఏరోఫ్లోట్ విమానం ఢిల్లీనుంచి నేరుగా బెర్లిన్ రాదుట. మాస్కోలో దిగి మరో విమానం మారాలిట. ఆ విమానం కోసం నావాళ్లు మాస్కో ఎయిర్‌పోర్టులో ఏడు గంటలు గడపాలి.

శ్రీమతి చదువు హైస్కూలు దాటలేదు. చదివిన మీడియం కూడా ఇంగ్లీషు కాదు. పెద్ద నగరాల్లో ఎక్కువ మసల్లేదు. తెలుగులో తప్ప ఇతర భాషల్లో ప్రావీణ్యం లేదు. విమానం ఎక్కడం ఇదే ప్రథమం. పిల్లలిద్దరూ ఐదేళ్ల లోపు వయసువాళ్లు. వాళ్లను తీసుకుని బయల్దేరి, ఢిల్లీలో విమానమెక్కి, మాస్కోలో దిగి అక్కడ ఏడు గంటలు ఎదురు చూసి మరో విమానం ఎక్కాలి. అప్పుడు తను తూర్పు జర్మనీ చేరుకుని అక్కణ్ణించి వెస్ట్ బెర్లిన్ రావాలి. ఇదంతా తనవల్లనౌతుందా?

అవదనే అనిపిస్తోంది. కానీ దేనికైనా ముందు పాజిటివ్‌గా ఆలోచించాలి కదా!

శ్రీమతి వ్యక్తిత్వాన్ని సానుకూల దృక్పథంలో విశ్లేషించసాగాను..

అప్పట్లో మన వ్యవస్థలో విద్యాధికులైన భారతీయ మహిళల్లో కూడా అధిక సంఖ్యాకులు సాధికారతలో బాగా వెనకబడి ఉన్నారనే చెప్పొచ్చు.

వాళ్లు వాహనాలు నడపరు. ఉద్యోగాలు చెయ్యరు. భువనేశ్వర్లో మా కాలనీ మహిళల్లో చాలామంది విద్యాధికులే. కానీ వాళ్లు ఇంటిపనుల్ని – మగపనీ, ఆడపనీ అని విభజించారు. మగపనులంటే అమ్మో అంటారు.

పోస్టాఫీసుకి వెళ్లడం, మనియార్డర్లు కట్టడం, బ్యాంకునుంచి డ్రాఫ్టులు తీసుకొనడం – ఇవన్నీ వాళ్లకి అమ్మో అనిపించే మగపనులే!

అంతే కాదు – ఒంటరిగా ఊళ్లోకెళ్లాలన్నా వాళ్లకు భయమే. భువనేశ్వర్లో రిజర్వేషన్ కంపార్టుమెంట్లో రైలెక్కి రాజమండ్రిలో దిగే ప్రయాణానికి కూడా – మగవాళ్లు (వాళ్లు చిన్నపిల్లలయినా ఫరవాలేదు) తోడుగా రావాలంటారు. ఆఫీసు పనిమీద ఒక్క రోజు భర్త వేరే ఊరికెడితే, సాయంగా వచ్చి పడుకోమని ఇరుగు పొరుగుల పిల్లల్ని రిక్వెస్ట్ చేస్తారు.

చెప్పాలంటే అదో సాగుబడి వాతావరణం.

శ్రీమతి అలాంటి వాతావరణంలో ఉంటూ కూడా ధైర్యసాహసాల్లో తన ప్రత్యేకతని నిరూపించుకుంది. బ్యాంకు పనులు, పోస్టాఫీసు పనులు ఆమెకి కరతలామలకం. ప్రయాణాల విషయానికొస్తే – నేను వాల్తేర్లో ఉన్నప్పుడే ఆమె ఒక రోజు కాకినాడ నుంచి ఒంటరిగా రైలు ప్రయాణం చేసింది. రైలు ఆలస్యమై చేరుకునేసరికి బాగా రాత్రి ఐనా సంకోచించకుండా స్టేషన్లో రిక్షా ఎక్కి, జనసంచారం లేని మార్గంలో సిరిపురం వచ్చింది. నేనే కాదు, మా కాలనీ మహిళలు కూడా ఆమె మానసిక స్థైర్యాన్ని అభినందిస్తుంటారు.

ఇవన్నీ గుర్తు చేసుకుని నా మనసుకి ధైర్యం చెప్పబోయాను కానీ మనసు లొంగడం లేదు.

ఇది శ్రీమతికి ఇంతవరకూ తానెరుగని విమాన ప్రయాణం. దేశం కాని దేశం. భాష కాని భాష.

తన ప్రయాణం గురించి నేనే ఇంత కలవరపడుతుంటే ఇక తనకెలా ఉంటుంది?

ఈ ప్రయాణం శ్రీమతి పాలిట కురుక్షేత్ర సంగ్రామంలా తోచింది నాకు. ఒకటొక్కటిగా బయటపడ్డ వివరాలన్నీ తెలిసి – ఆమె పార్థుడిలా నీళ్లుగారిపోయే ప్రమాదముంది.

నేను గీతా బోధ చేస్తే తప్ప – తను ముందడుగు వెయ్యలేదు.

ఎలాగైనా ఆమెని ఇక్కడికి రప్పించాలి. అందుకని బాగా ఆలోచించి ఆమెకి ఓ ఉత్తరం వ్రాయాలనుకున్నాను.

విమాన ప్రయాణ విషయంలో నాకున్న పరిజ్ఞానం స్వల్పమన్న విషయం ఆమెకి తెలియకూడదు. కానీ ఆ జ్ఞానాన్ని ప్రదర్శిస్తూ ఆమెకి ధైర్యం చెప్పాలి.

ప్రయాణంలో ఆమె ఎదుర్కోనున్న ఇబ్బందుల్ని నిజాయితీగానూ, భయపెట్టకుండా లౌక్యంగానూ ఆమె ముందుంచాలి. ఐతే వాటిలో తూర్పు జర్మనీ సమస్యని ప్రస్తావించకూడదు. షాకులకి కూడా ఓ డోసుంటుంది మరి.

నా ఉత్తరం ఇలా కొనసాగింది.

గీతోపదేశం

*"ప్రియమైన వసూ!*

అతి త్వరలో నన్ను చేరబోతున్న నీకు నేను వ్రాస్తున్న చివరి ఉత్తరమిది. ప్రయాణానికి ముఖ్యమైన అతి ముఖ్య సూచనలు ఇందులో ఇస్తున్నాను. ఇది చదవగానే, విమాన ప్రయాణం ఇంత సులభమా అనుకుంటావని నా నమ్మకం. ఇందులో వివరాలు అవసరపడొచ్చు కాబట్టి ప్రయాణంలో ఈ ఉత్తరాన్ని దగ్గరుంచుకో. 1. అవసరమైన (తిండి, బ్రష్షూ పేస్టూ, స్వెటరు వగైరాలు) కొద్ది సామాను నీ దగ్గర చిన్న బ్యాగులో ఉంచుకుని మిగతాదంతా లగేజి కింద ఢిల్లీలో ఈస్ట్ బెర్లిన్‌కి బుక్ చేసెయ్యాలి. ఈ బుకింగు ప్రయాణానికి ఒకటి రెండు గంటల ముందుగా జరుగుతుంది. అది చేస్తే బెర్లిన్ చేరుకునేదాకా నీకు లగేజి గురించిన బెంగ ఉండదు.

2. దారిలో తినడానికి బిస్కట్ల ప్యాకెట్, స్లైస్‌డ్ బ్రెడ్ ప్యాకెట్, అరడజను అరటిపళ్లు ఉంటే చాలు. ప్రయాణానికి ముందు పిల్లలచేత పాలు తాగించు.

3. పాస్‌పోర్టు, హెల్త్ సర్టిఫికెట్లు, ఎయిర్ టికెట్లు – వీటిని లగేజిలో బుక్ చెయ్యకుండా దగ్గరే ఉంచుకోవాలి. ప్రయాణంలో ఎప్పుడు ఎవరడిగినా చూపించేందుకు వీలవుతుంది.

4. ఈ ప్రయాణంలో మాట్లాడాల్సిన అవసరం చాలా తక్కువ. విమానమెక్కి బయల్దేరిన కాసేపటికి ఎయిర్ హోస్టెస్‌కి ఇంగ్లీషులో చెబుతావూ, "క్షమించాలి. నాకు సాయం కావాలి. నేను మొదటిసారిగా విమానంలో ప్రయాణం చేస్తున్నాను. ఇంగ్లీషు అంత బాగా రాదు. నేను ఈస్ట్ బెర్లిన్ వెడుతున్నాను. మాస్కోలో విమానం మారడానికి మీరు సాయపడగలరా?" అని. ఆడవారికి – అందులోనూ పిల్లల తల్లులకి విమానంలో మంచి సాయం లభిస్తుంది. విమాన ప్రయాణంలో అన్‌రిజర్వ్‌డ్ ప్రయాణీకులుండరు కాబట్టి నీకే భయమూ ఉండదు. ఎయిర్ హోస్టెస్ స్వయంగా తనే సాయం చెయ్యొచ్చు. లేదా ఈస్ట్ బెర్లిన్ వెడుతున్న ప్రయాణీకులకి నిన్ను అప్పగిస్తుంది.

5. నీ విమానం ఢిల్లీలో 4.05కి బయల్దేరి – మాస్కోకి రష్యన్ స్టాండర్డ్ టైం ప్రకారం 8.00కి చేరుతుంది. అక్కడ నువ్వు సుమారు ఏడు గంటలు గడపాలి. అందుకుగానూ నీకు చక్కటి వసతి సదుపాయం ఏర్పాటు చేస్తారు. ఎప్పుడైనా ఏమైనా సాయం అవసరమైతే – విమానాశ్రయంలో ఏరోఫ్లోట్, ఎయిరిండియా వాళ్ల కౌంటర్స్ ఉంటాయి. అడిగి సాయం పొందవచ్చు.

6. విదేశాల్లో లెట్రిన్లని టాయ్‌లెట్లని వ్యవహరిస్తారు. పిల్లల్ని లెట్రిన్‌కి తీసుకెళ్లాలంటే, "టాయ్‌లెట్‌కి వెళ్లాలి" అని చెబితే ఎవరైనా దారి చూపిస్తారు. మాస్కో ఎయిర్‌పోర్టులో ఏడు గంటలుంటావు కాబట్టి, కాసేపటికే మీరంతా అక్కడి వాతావరణానికి అలవాటు పడిపోతారు. విమానాశ్రయం వెచ్చగా ఉంటుంది కాబట్టి చలి బాధ ఉండదు. విమానం తప్పిపోతుందన్న బెంగలేదు కాబట్టి నిశ్చింతగా ఉండొచ్చక్కడ. కాలం ఇట్టే గడిచిపోతుంది.

7. మాస్కోలో నీ ఫ్లైట్ నంబరు ఐఏ 113 (ఐఏ అంటే సోవియట్ యూనియన్ కావచ్చు). బయల్దేరే సమయం 15.50. ఆక్కణ్ణించి బెర్లిన్ చేరుకునేసరికి జర్మన్ స్టాండర్డ్ టైం ప్రకారం 16.15 ఔతుంది. అక్కడ నిన్ను నేను కలుసుకుంటాను. ఈలోగా మరొక్కసారి ఇంగ్లీషులో

మాట్లాడాల్సి ఉంటుంది నువ్వు. మాస్కోలో విమానం ఎక్కేక, "క్షమించాలి. బెర్లిన్లో నా లగేజి ఎలా తీసుకోవాలో నాకు తెలియదు. మీరు సాయం చేస్తారా?" అనడిగితే చాలు. విమానం దిగగానే ఎయిర్ హోస్టెస్ నీకు లగేజి వచ్చే చోటు చూపిస్తుంది. అక్కడే చిన్న ట్రాలీలుంటాయి (కూలీలుండరు). నీ లగేజి ట్రాలీలో పెట్టుకుని తోసుకుంటూ బయటకు వస్తే, నిన్నూ, పిల్లల్నీ, మీ లగేజినీ పువ్వుల్లో పెట్టి ఇంటికి తీసుకెడతాను.

8. ఈ ప్రయాణం మొత్తంమీద రెండే రెండు సార్లు నువ్వు కాస్త పెద్ద ఇంగ్లీషు వాక్యాలు చెప్పాల్సి ఉంటుందంతే! ఎంత సులభమో చూసేవా! నీ ప్రయాణం జయప్రదంగా జరుగుతుంది. ఇంకా నీకేమైనా అనుమానాలుంటే – మా అన్నయ్య అంటే నీ బావగార్ని అడిగి తెలుసుకో.

9. స్వతహాగా ధైర్యవంతులైనవారికి – ధైర్యం చెబితే నీళ్లు కారిపోయే ప్రమాదముందని నాకు తెలుసు. నేనీ ఉత్తరం ఇలా వ్రాయడానికి కారణం నీ శక్తిని తక్కువ అంచనా వేసి కాదు. కానీ నా పిచ్చి నాది కదా! అసలే సందేహప్రాణిని. టికెట్సు పంపేదాకా పంపగలనా అని అధైర్యపడుతూ వచ్చాను. ఇప్పుడు నీ సంకల్పబలం తెలిసి కూడా – నువ్వు రానంటావేమోనని భయపడుతున్నాను.

10. విమానం ఎక్కేముందే స్వెటరు, సాక్సు, బూట్సు ధరించడం మంచిది. మఫ్లర్లు కూడా దగ్గరుంచుకోండి. ప్రస్తుత వాతావరణం కాస్త మెరుగ్గానే ఉంది. ఇక్కడ టెంపరేచర్ 6–10 డిగ్రీలుంటోంది. కానీ జనవరి 7కి ఎలా ఉంటుందో తెలియదు కదా!

11. ఏడు అంకె వేసినప్పుడు మధ్యలో అడ్డ గీత పెట్టడం మంచిది. ఇక్కడ వీళ్లు వ్రాసే 1, 7 ఇంచుమించు ఒక్కలాగే ఉంటాయి. తేడా తెలియడానికి ఆ అడ్డగీత అవసరం. పిల్లలిద్దర్నీ చూడాలని తపించిపోతున్నాను. ఈ ఉత్తరం అందిన వెంటనే ఒక ఉత్తరం రాస్తావని ఆశ. ప్రస్తుతం నాకు క్షణాలు యుగాలకంటే పెద్దవిగా తోస్తున్నాయి. నువ్విక్కడికి రాగానే – నైలెక్స్ చీరల విషయమై ఆకర్షణీయమైన సమాచారం చెబుతాను......"

ఉత్తరం చివర సంతకం పెట్టి వెంటనే పోస్ట్ చేశాను.

ఈ ఉత్తరం శ్రీమతికి మంచి సమయంలో అందాలి. ప్రయాణానికి ఆమెను సుముఖం చెయ్యాలి. నావాళ్లతో ఇక్కడ కలిసి గడిపే అదృష్టానికి నేను నోచుకోవాలి.

శ్రీమతిని ప్రయాణానికి సుముఖం చెయ్యడానికి వ్రాసిన ఈ ఉత్తరంకోసం నా తెలివినంతా వెచ్చించాను. ఇక నా ఆశలన్నీ ఆ ఉత్తరంమీదే!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments